

డ్రెయిన్లలో పూడికతీత పనులు చేపట్టాలి

ప్రజాశక్తి - అమలాపురం

అమలాపురం డ్రెయిన్, చల్లపల్లి డ్రెయిన్, ముమ్మిడివరం, కాట్రేనికోన డ్రెయిన్లలో పూడిక తీత పనులు వెంటనే నిర్వహించాలని పిడిఎఫ్ ఎంఎల్సి ఇళ్ల వెంకటేశ్వరరావు డ్రెయిన్స్ డిఇ ఎంవివి.కిషోర్‌ను కోరారు. ఈ డ్రెయిన్లు అన్నీ గుర్రపుడెక్క, చెత్తతో నిండిపోవడంతో నీరు పారట్లేదన్నారు. ఫలితంగా పంటచేలలో నీరు లాగక రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఇదే పరిస్థితి కొనసాగితే పంట నీటిలోనే కుళ్లిపోయే ప్రమాదం ఉందన్నారు. ఇటీవల నీటి సలహా మండలి, వ్యవసాయ సలహా మండలి సమావేశాల్లో సైతం రైతులు ఇదే విషయమై మొరపెట్టుకున్నారన్నారు. నిధులు లేకపోవడం వల్ల పనులు చేపట్టలేపోతున్నామని పేర్కొనడం సరికాదన్నారు. తక్షణం పూడిక తీత పనులు నిర్వహించాలని కోరారు. దీనిపై డిఇ సానుకూలంగా స్పందించారు. నిధులు కొరత సమస్య ఉన్నప్పటికీ పూడికతీత పనులు వెంటనే చేపడతామని తెలిపారు.

ఇంకా నీటిలోనే...

- నానుతున్న వరి పనలు, ముంపులోనే చేలు
- నీటమునిగిన పంటలను పరిశీలించిన అధికారులు
- ఆదుకోవాలని కోరుతున్న అన్నదాతలు

జిల్లాలో వరిచేలు ఇంకా నీటిలోనే నానుతున్నాయి. వరిపనలు కుళ్లిపోయే స్థితికి చేరుకున్నాయి. పలుచోట్ల ధాన్యపురాసులు తడిసి ముద్దవ్వడంతో మొలకలు వచ్చాయి. ఉన్న పంటను ఒబ్బిడి చేసుకునేందుకు రైతులు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. పాడైన పంటలను అధికారులు, వివిధ పార్టీల నాయకులు పరిశీలించారు. నష్టపోయిన రైతులను ఆదుకోవాలంటూ పలుచోట్ల ధర్నాలు జరిగాయి.

నానుతున్న వరి పంట

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలంలో వరి చేలు ఇంకా నీటిలోనే నానుతున్నాయి. పలుచోట్ల వర్షపు నీరు డ్రెయినేజీల్లో సరిగ్గా దిగకపోవడంతో నీరంతా చేలల్లోనే నిలిచిపోతోంది. పనలు సైతం నీటిలోనే నానుతుండంతో మొలకలు వస్తున్నాయి. శివల గ్రామంలో పంట పొలాలను ఆర్‌బికె సిబ్బంది శుక్రవారం పరిశీలించారు. వీలైనంతవరకు పనలను ఒడ్డుకు తెచ్చుకుని ఆరబెట్టుకోవాలని, పడిపోయిన వరి చేలలో వర్షం నీరు వేగంగా దిగేటట్టు చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు. మరో రెండు రోజులు ఇలాగే ఉంటే నష్టం మరింత పెరుగుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అన్ని రకాల ధాన్యం కొనుగోలు

వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ ఇళ్ల సూర్యనారాయణ

తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులు అధైర్య పడాల్సిన అవసరం లేదని కె.గంగవరం మండలం వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ ఇళ్ల సూర్యనారాయణ తెలిపారు. కె.గంగవరం మండలంలోని తడిసిన ధాన్యం రాసులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ప్రస్తుతం ఎగుమతులకు అవరోధంగా ఉన్న జిపిఎస్ విధానాన్ని ప్రభుత్వం నిలిపివేసిందన్నారు. రైతులంతా ధాన్యాన్ని వేగంగా మిల్లులకు తరలించుకోవచ్చని ఆయన సూచించారు. మంత్రి వేణు చొరవతో జిపిఎస్ విధానాన్ని నిలిపివేశారని పేర్కొన్నారు.

1,700 టన్నులు ధాన్యం ఎగుమతి

మండలంలో గురు, శుక్రవారాల్లో 1700 టన్నులు ధాన్యం ఎగుమతి అయ్యిందని మండల వ్యవసాయ అధికారి బలుసు రవి తెలిపారు. జిపిఎస్‌ను నిలిపేయడంతో ధాన్యం సులువుగా ఎగుమతి చేసుకునే వెసులుబాటు దొరికిందన్నారు. ఏవైనా సాంకేతిక సమస్యలు ఉంటే ఆర్‌బికె, మిల్లుల వద్ద ఉన్న కస్టోడియల్ అధికారులకు తెలియజేయాలన్నారు. ఈ రెండు రోజుల్లోనూ ఎగమతులు భారీగా పెరిగాయని తెలిపారు. అన్ని రకాల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

ముమ్మిడివరం : భారీ వర్షాలకు నీట మునిగి పంట నష్టపోయిన ప్రతి రైతుకూ పంట నష్టపరిహారాన్ని అందించేందుకు కృషి చేస్తున్నామని ముమ్మిడివరం డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎంవి.రామారావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం సమావేశపు హాల్లో శుక్రవారం మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు జగతా పద్మనాభం అధ్యక్షతన సలహా మండలి పాలక వర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రామారావు మాట్లాడారు. భారీ వర్షాలకు మండలంలో సుమారు 2,200 ఎకరాల్లో వరి పంట నీట మునిగినట్టు అంచనా వేశామన్నారు. ప్రతి ఎకరాకు నష్టపరిహారం రూ.6వేలు, హెక్టార్‌కు రూ.15వేల చొప్పున పరిహారం అందిస్తామన్నారు. పంటల బీమా ద్వారా రుణాలను సాధ్యమైనంత త్వరగా అందించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. మండలానికి 32 పంట కోత ప్రయోగాలు మంజురుకాగా ఇప్పటికి 22 ప్రయోగాలను వివిధ గ్రామాల్లో పూర్తి చేశామన్నారు. పంట నష్టం 33 శాతం దాటితేనే పంటల బీమా వర్తిస్తుందన్నారు. 50 శాతం నష్టం జరిగితే పూర్తి నష్టపరిహారం వర్తిస్తుందన్నారు. వర్షాలకు పూర్తిగా తడిసిన ధాన్యంపై ఉప్పు ద్రావణం పిచికారీ చేయడం ద్వారా మొలకలు రాకుండా అరికట్టాలన్నారు. నాణ్యతకు అనుగుణంగా లేని ధాన్యాన్ని రైస్ మిల్లర్లు తో చర్చించి కొనుగోలు చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈ సమావేశంలో కర్రివానిరేవుకు చెందిన రైతు మాట్లాడుతూ 20 రోజుల క్రితం కోసినప్పటికి ఆర్‌బికె సిబ్బంది సకాలంలో సంచులు అందించలేదన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ధాన్యం తడిసిపోయింది ఆవేదన వ్యక్తం చేశారు. రైతులే రవాణా ఏర్పాట్లు చేసుకోవాలని ఆంక్షలు విధిస్తున్నారని తెలపారు. చిట్టి రాజు మాట్లాడుతూ ఇటువంటివి పునరావృతమైతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపడతామని హెచ్చరించారు. లంక ప్రాంతాల్లో వేరుసెనగ, మొక్కజొన్న పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, వాటి నష్టం అంచనాలు పారదర్శకంగా రూపొందించి ప్రతి రైతుకు న్యాయం చేయాలన్నారు. అరటి, బొప్పాయి పంటల నష్టం అంచనాలు రూపొందించాలని వీటికి పంట నష్ట పరిహారం త్వరిత గతిన అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. పంట కాలువల్లో వెంటనే పూడిక తీత పనులు చేపట్టాలని ఇరిగేషన్ ఎఇ మౌనికను ఆదేశించారు. రబీలో నీటి ఎద్దడిని నివారించేందుకు చర్యలు చేపట్టాలని సమావేశం తీర్మానించింది. ఈ సమావేశంలో నగర పంచాయతీ చైర్మన్ కమిడీ ప్రవీణ్ కుమార్, జడ్‌పిటిసి సభ్యులు కుడిపూడి శివశంకరరావు, కోలా బాబ్జి, ఆర్‌బికె, వ్యవసాయ శాఖ, ఇరిగేషన్ సిబ్బంది పాల్గొన్నారు.


నీటిలో నానుతన్న పంటను కాపాడుకునేందుకు పాట్లు పడుతున్న రైతులు


శివలలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఆర్‌బికె సిబ్బంది


కొత్తపేట మండలం పలివెలలో మొలకలు వచ్చిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న బండారు

రైతులను ఆదుకోవాలని ధర్నా

భారీ వర్షలూ వల్ల నష్టపోయిన తమను ఆదుకోవాలంటూ శుక్రవారం రైతులు మామిడికుదురు తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వీరికి టిడిపి, జనసేన నాయకులు సంఘీభావం తెలిపారు. ముంపు బారిన పడి నష్టపోయిన రైతులకు తక్షణమే నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ ధర్నాలో టిడిపి నాయకులు జె.సుబ్బారావు, ఈలి శ్రీనివాసరావు, జనసేన నాయకులు జె.శ్రీనివాసరాజు, కె.నర్సింహారావు పాల్గొన్నారు.

రైతులను పట్టించుకోని ప్రభుత్వం

ప్రజాశక్తి - కొత్తపేట

తుపానుతో రైతులు పుట్టెడు కష్టాల్లో ఉంటే ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరిస్తుందని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు సత్యానందరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్తపేట మండలం పలివెలలో నీట మునిగిన పంట పొలాలను, ధాన్యపు రాసులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. తమ నాయకుడు చంద్రబాబు రైతుల కష్టాలు విని వారికి ధైర్యాన్ని ఇచ్చేందుకు ప్రజాక్షేత్రంలో ఉండటానికి సిద్ధమయ్యారన్నారు. తుపాను కంటే ముందుగానే కొంత మేర కోతలు జరిగి పంట చేతికి వచ్చిందన్నారు. ప్రభుత్వం అసమర్థత కారణంగా, పాలనతో కనీసం ధాన్యం సంచులు కూడా రైతులకు అందివ్వలేదన్నారు. ధాన్యం పట్టుకోవడానికి సంచులు లేక సరైన సమయంలో ధాన్యం కొనుగోలు చేయకపోవడం వల్లే రైతులు పంటను కోల్పోయారన్నారు. తక్షణమే తడిసిన ధాన్యాన్ని ఎటువంటి నిబంధనలు లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.


విరాళం అందిస్తున్న కలెక్టర్ హిమాన్షుశుక్లా

సైనికుల కుటుంబాలను ఆదుకోవాలి

కలెక్టర్ హిమాన్షుశుక్లా

ప్రజాశక్తి - అమలాపురం

సాయుధ దళాల పతాక నిధికి విరాళాలు అందించి సైనికుల కుటుంబాలను ఆదుకోవాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా పిలుపు నిచ్చారు. డిసెంబర్ 7న సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని (ఫ్లాగ్ డే) పురస్కరిం చుకొని శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ సాయుధ దళాల పతాక నిధికి విరాళం అందించారు. జిల్లా సైనిక సంక్షేమ అధికారి నుంచి పతాకాన్ని అందుకొని విరాళాల సేకరణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రక్షణకు ప్రాణాలను అర్పించిన సైనికుల కుటుంబాలను ఆదుకోవాల్సిన భాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. సాయుధ దళాల పతాక నిధికి విరివిగా విరాళాలు అందించాలన్నారు. దేశ రక్షణ కోసం పోరాడి అసువులు బాసిన సైనికుల కుటుంబ సభ్యులకు సాయుధ దళాల పతాక దినోత్సవ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. దేశ గౌరవాన్ని కాపాడేందుకు సరిహద్దుల్లో దైర్యంగా పోరాడి వీరమరణం పొందిన సైనికులకు నివాళుల ర్పించారు. వారి కుటుంబాలకు అండగా నిలిచే సంకల్పంతో 1949 సంవత్సరం నుంచి ప్రతి సంవత్సరం డిసెంబర్ 7న సాయిధదళాల పతాక దినోత్సవాన్ని పాటిస్తున్నామన్నారు భారత జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి కెప్టెన్ సత్య ప్రసాద్ మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సాయుధ దళాల పతాక దినోత్సవం -2022 విరాళాల సేకరణ ద్వారా రూ.20 లక్షలు సేకరించామన్నారు. ఈనెల 11న చెక్కు రూపంలో కలెక్టర్‌కు డిఆర్‌డిఎ పీడీ అందిస్తారన్నారు. కె.గంగవరం మండలం పేకేరుకు జవాను పిట్టా శ్రీ నివాసరావు ఈ ఏడాది జులై 29న మరణించాడని తెలిపారు. ఆయన భార్య పిట్టా శ్రీలక్ష్మిని రాష్ట్ర గవర్నర్ విజయవాడలో సన్మానించారన్నారు. దేశ రక్షణ కోసం పోరాడుతున్న ప్రతి సైనికునికి రుణపడి ఉంటామని ఆ రుణం తీర్చుకునే అవకాశం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో జెసి ఎస్.నుపూర్‌అజయ్, డిఆర్ఓ సిహెచ్.సత్తిబాబు, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పథక సంచాలకులు వి.శివశంకర్‌ప్రసాద్, జిల్లా సైనిక సంక్షేమ శాఖ కార్యాలయ పర్యవేక్షకులు, జి.చినవెంకట రావు, సిబ్బంది, మాజీ సైనికులు పాల్గొన్నారు.

స్కోరింగ్ యాప్‌పై శిక్షణ

ప్రజాశక్తి - అమలాపురం

ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల నిర్వహణకు సంబంధించి స్కోరింగ్ యాప్‌పై శిక్షణా కార్యక్రమం ప్రారంభించామని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకులు సురేష్ కుమార్ శుక్రవారం తెలిపారు. సచివాలయ స్థాయి నుంచి ఈ పోటీలు ఈ నెల 15 నుంచి ప్రారంభమవుతాయన్నారు. క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్‌లో బాలికలు, బాలుర విభాగాల్లో పోటీలు నిర్వహించాలని సూచించారు. సచివాలయ స్థాయి విజేతలు మండల స్థాయి పోటీలకు, మండల స్థాయి విజేతలు నియోజకవర్గ స్థాయి పోటీలకు, నియోజకవర్గ స్థాయి విజేతలు జిల్లా స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించాలన్నారు. ఈనెల 13వరకూ క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేసుకునే వీలుందన్నారు. శుక్రవారం ఉదయం అమలాపురం, అయినవిల్లి, అంబాజీపేట, అల్లవరం, పి.గన్నవరం సచివాలయాలకు చెందిన సిబ్బంది ఇద్దరు చొప్పున కలెక్టరేట్ గోదావరి భవన్‌లో శిక్షణ అందించామన్నారు. మధ్యాహ్నం ముమ్మిడివరంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలి

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు తెలిపారు. అమలాపురం మండలం ఈదరపల్లిలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద 7 అసెంబ్లీ నియోజకవర్గ నూతన కన్వీనర్లు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాల కోసం ఎస్ఎస్ఎ సిబ్బంది ధర్నా

ప్రజాశక్తి - అమలాపురం

పెండింగ్ వేతనాలు ఇవ్వాలంటూ ఎపి సర్వ శిక్ష అభియాన్ కాంట్రాక్ట్ అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధర్యంలో ఉద్యోగులు ఆవేదన దీక్ష, మానవహారం నిర్వహించారు. ఈ దీక్షను ఉద్దేశించి పిడిఎఫ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు, సిఐటియు నాయకులు నూకల బలరాం, కృష్ణవేణి, దుర్గాప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘ కార్యదర్శి కారెం వెంకటేశ్వరరావు, సమగ్ర శిక్ష ఉద్యోగ నాయకులు శ్రీనుబాబు, వెంకట్, నాగన్న, ముత్తాబత్తుల శ్రీనివాసరావు తదితరులు మాట్లాడారు. విద్యాశాఖ పరిధిలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. పిఆర్‌సి అమలు చేయకుండా, నెలలు తరబడి వేతనాలు విడుదల చేయకపోవడం దుర్మార్గమన్నారు. స్వయంగా ముఖ్యమంత్రి ప్రకటన చేసిన మినిమం ఆఫ్ టైం స్కేల్‌పై జిఒలమీద జీవోలు ఇచ్చి అమలు చేయకపోవడం దుర్మార్గమన్నారు. సమగ్ర శిక్షలో ఒకే క్యాడర్ ఉద్యోగులకు రకరకాల వేతనాలు ఇవ్వడం ఎక్కడా లేదన్నారు. పార్ట్ టైం పేరుతో తక్కువ జీతాలు ఇచ్చే విధానాలను మానుకోవాలన్నారు. ఎన్నికలకు ముందు రెగ్యులర్ చేస్తామని, సమాన పనికి సమాన వేతనం అమలు చేస్తామని హామీలు ఇచ్చి ఇప్పుడు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. సమస్యలను పరిష్కరించకపోతే రాబోయే కాలంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలకు రైతు సంఘ నాయకులు అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, యాళ్ల బ్రహ్మానందం మద్దతు తెలిపారు. సమగ్ర శిక్ష అభియాన్ నాయకులు వెంకటేశ్వరరావు, గంగాధర్, శ్రీనివాస్, గౌతమ్ ప్రసాద్, దుర్గ భవాని ఉద్యోగులు పాల్గొన్నారు.


ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతున్న పిడిఎఫ్ ఎంఎల్‌సి ఐవి

రాష్ట్ర స్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - అంబాజీపేట

పుల్లేటికుర్రు ఉన్నత పాఠశాలలకు చెందిన గొర్రెల శ్రీలక్ష్మీపావని, రాపాక మేరీ, కొల్లు వినయవ్యాప్తి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 9న గుంటూరులో జరిగే రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో వారు పాల్గొనున్నరని హెచ్ఎం కె.కనకదుర్గ శుక్రవారం తెలిపారు. వారిని సర్పంచ్ జల్లి బాలరాజు, పిఎంసి చైర్మన్ మర్రి ఏడుకొండలు, ఎంపిటిసి సభ్యులు వడలి కృష్ణమూర్తి, పబ్బినీడి రాంబాబు, కుసుమ వెంకటేష్, పిఎసిఎస్ అధ్యక్షులు నందుల ఆదినారాయణ, ఉప సర్పంచ్ వీరా రవి, ఉపాధ్యాయులు అభినందించారు.


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం కనకదుర్గ

వికలాంగ బాలికల కోసం వసతిగృహం ఏర్పాటుకు అనుమతులు

ప్రజాశక్తి - అమలాపురం

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో వికలాంగులు, మానసిక వికలాంగులైన బాలికల కోసం ప్రత్యేక వసతి గృహం స్వచ్ఛంద సంస్థ ద్వారా నడిపించేందుకు అనుమతి ఇచ్చారని జిల్లా మహిళా శిశు, సంక్షేమ సాధికారిత అధికారి, జిల్లా మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ సాధికారిత అధికారి జి.సత్యవాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా దీన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ వసతి గృహం నిర్వహణ కోసనం అసక్తి ఉన్న స్వచ్ఛంద సంస్థలు ప్రాజెక్టు ప్రపోజల్స్‌ను తీసుకొని ఈ నెల 16న సాయంత్రం ఐదు గంటల్లోపు తమ కార్యాలయంలో అందించాలన్నారు. వివరాలను ముమ్మిడివరంలోని తమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

టిడిపి బిసి విభాగం జిల్లా అధికార ప్రతినిధిగా కేశవ

ప్రజాశక్తి - అంబాజీపేట

టిడిపి బిసి విభాగం జిల్లా అధికార ప్రతినిధిగా తొండవరం గ్రామానికి చెందిన పితాని కేశవ, బిసి కార్యనిర్వహక కార్యదర్శిగా వక్కలంకకు చెందిన యనమదల రాజబాబులను నియమిస్తూ జిల్లా అధ్యక్షులు రెడ్డి అనంతకుమారి శుక్రవారం నియామక ఉత్తర్వులు పంపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ నియామకానికి కృసి చేసిన జిల్లా అధ్యక్షులు, టిడిపి పి.గన్నవరం నియోజకవర్గ వన్ మ్యాన్ కమిటీ హరీష్‌మాథూర్, మాజీ ఎంపిపి డివివి.సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

సేవలపై అప్రమతంగా ఉండాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - కాట్రేనికోన

సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందించే సేవల విషయంలో సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని ఎంపిడిఒ కె.కామేశ్వరరావు సచివాలయం సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశపు హాల్లో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో అయన సమీక్ష నిర్వహించారు. ఆడుదాం ఆంధ్రా, కుల గణన, జగనన్న ఆరోగ్యశ్రీ యాప్ డౌన్లోడ్, ఆయుష్మాన్ భారత్, అన్ని పథకాల ఎక్నాలెడ్జ్‌మెంట్స్, సచివాలయం సిబ్బంది హాజరు, పేమెంట్ ఎక్నాలెడ్జ్‌మెంట్స్, జగనన్న పాల వెల్లువ, ఈ సర్వీస్, ఒటిఎస్ అమౌంట్ పెండింగ్ తదితరాలపై సమీక్షించారు. పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ జెఇ సుబ్రహ్మణ్యం, హౌసింగ్ ఎఇ కెవివిఎస్.సుబ్రహ్మణ్యం, పరిపాలన అధికారి ఎంహెచ్‌ఆర్.శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

తుపాను బాధితులకు రెడ్‌క్రాస్ చేయూత

ప్రజాశక్తి-ఐ.పోలవరం

తుపాను కారణంగా ఇల్లు ధ్వంసమై నిర్వాసితులైన టి.కొత్తపల్లి గ్రామం అడవిపేటకు చెందిన ముమ్మిడివరపు వెంకటేశ్వరరావు కుటుంబానికి టార్పాలిన్, ఐజెనిక్‌కిట్‌ను రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ కోరుకొండ సత్యనారాయణ అందించారు. బాధితులకు ప్రభుత్వ సాయం అందేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ పిన్నమరాజు వెంకటపతిరాజు, జడ్‌పిటిసి సభ్యులు ముదునూరి సతీష్‌రాజు, సొసైటీ ప్రెసిడెంట్ వడ్డీ గౌతమ్, పండు విజయ్‌కుమార్, ఎంపిటిసి సభ్యులు కోమనపల్లి శ్రీనివాస్, విఆర్ఓ సత్యనారాయణ, ఫీల్డ్ కో-ఆర్డినేటర్ రత్న ప్రసాద్ పాల్గొన్నారు.


విజేతలతో ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు

గౌతమి విద్యార్థులకు ఎంఎల్‌సి తోట అభినందన

ప్రజాశక్తి - మండపేట

రిలయన్స్ క్విజ్ -2023లో ఉత్తమ ప్రతిభను కనబర్చిన గౌతమీ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులను ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు అభినందించారు. ఇటీవల రాజమహేంద్రవరంలో జరిగిన క్విజ్ పోటీల్లో గౌతమి విద్యార్థులు పాల్గొని విజేతలుగా నిలిచారు. రూ.50వేలు విలువ చేసే రెండు ల్యాప్‌టాప్‌లను బహుమతులుగా అందుకున్నారు. వరుసగా 7వ సారి ఈ ఘనతను సాధించిన ఏకైక పాఠశాలగా గౌతమీ మున్సిపల్ హైస్కూల్ పేరొందింది. శిక్షణ ఇచ్చిన పి.రామచంద్రరెడ్డి, విద్యార్థులను ఎంఎల్‌సితో పాటూ ఎంపిపి ఉండమట్ల శ్రీనివాసు, మండపేట మార్కెట్ కమిటీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాస్, వైస్ ఎంపిపి పసుమర్తి నాగేశ్వరరావు, తూర్పుగోదావరి జిల్లా డిఇఒ అబ్రహాం, ఎంపిడిఒ ఐదం రాజు, మండల విద్యాశాఖాధికారులు నాయుడు రామచంద్రరావు, సోమిరెడ్డి, ప్రముఖ వైద్యులు, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు డాక్టర్ చల్లా రవికుమార్, యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ కె.గోపాలకృష్ణారెడ్డి, హెచ్ఎం సిహెచ్.శోభావళి, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

కార్టూ'నిజం'



నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి - అమలాపురం

తుపాను వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కోనసీమ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అదించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. తడిచిన, రంగు మారిన, మొలకలు వచ్చిన వరి ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా ఎంఎస్‌పి ధరకు కొనుగోలు చేయాలన్నారు. ఈ ధాన్యాన్ని అంతటినీ బాయిల్ రైసు మిల్లులతో కొనిపించాలన్నారు. ఎంటియు 1318 రకాన్ని రైతులు ఎక్కువగా సాగు చేశారన్నారు. బాగా పండినా తుపాను కారణంగా చేలు నేలకొరిగాయన్నారు. ముంపునకు గురైన 24 గంటల్లోనే వరి వెన్నులు మొలకెత్తడం ప్రారంభించి, రైతులను కీలుకోలేని దెబ్బ తీసిందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పనలపై పంట, పడిపోయిన వరిచేలు మాసూళ్లు చేసే పరిస్థితి లేదన్నారు. అధికారులు వెంటనే క్షేత్ర స్థాయి పరిశీలన చేసి, జరిగిన నష్టాల్ని నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మాసూళ్లు కాని పంటచేలను పూర్తిస్థాయి నష్టంగా పరిగణించి పరిహారం అందించాలన్నారు. ఫసల్ భీమాలో భాగంగా 40 శాతం బీమా పరిహారాన్ని చెల్లించాలన్నారు. మిగిలిన 60 శాతం పరిహారాన్ని 30 రోజుల్లో అందించాలన్నారు. ఎకరాకు రూ.30వేల పరిహారం అందించాలన్నారు. కౌలు రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ బీమా పరిధిలోకి తీసుకొచ్చి, ఆదుకోవాలన్నారు. ప్రతిఏటా నష్ట తీవ్రతను దృష్టిలో పెట్టుకొని రెవెన్యూ, మీడియం, మైనర్ డ్రెయిన్లను యుద్ధ ప్రాతిపదికన ఆధునికీకరించాలన్నారు. మేజర్ డ్రెయిన్లకు అనుసంధానం చేయాలన్నారు. రబీ పంట వేసేందుకు మరింత ఆలస్యం అవుతుందని, రబీ సమాయత్తానికి రైతులకు తగిన సహకారం అందించాలన్నారు. నారుమళ్లు దెబ్బదిన్న రైతులకు వరి విత్తనాలను వెంటనే సరఫరా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు యాళ్ల బ్రహ్మానందం, అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, ఎం నరసింహారావు, చిక్కాల పెద్దబ్బులు, పెమ్మిరెడ్డి సత్యనారాయణ, ఆకుల సత్యనారాయణ, చిక్కం గణేష్, జొన్నగంటి రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న కోనసీమ రైతు సంఘం నాయకులు

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు

ప్రజాశక్తి - మండపేట

అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వం సంక్షేమ ఫలాలు అందిస్తుందని సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం అన్నారు. శుక్రవారం ఏడిద సచివాలయంలో 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశీర్వాదం మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ పేదల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి వచ్చిన లబ్ధి, అభివృద్ధి తెలిపే బోర్డును ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి పసుమర్తి నాగేశ్వరరావు, జడ్‌పిటిసి సభ్యులు కురుపూడి భవాని, పంచాయతీ సభ్యులు చిలుకూరు బుజ్జి, వైసిపి గ్రామ కన్వీనర్ పలివెల సుధాకర్, ఎంపిటిసి సభ్యులు, ఎంపిడిఒ ఐదం రాజు, పంచాయతీ కార్యదర్శి వీర్రాజు, యానిమేటర్లు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ ఆశీర్వాదం

నేరాలు ఘోరాలు

గుర్తు తెలియని వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - కిర్లంపూడి

బూరుగుపూడి నుంచి రామవరం జాతీయ రహదారి పక్కన గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడు. స్థానికులు కిర్లంపూడి పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ పి.ఉమామహేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - కొత్తపేట

మంలంలోని కమ్మిరెడ్డిపాలెం మలుపు వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయపడ్డాడు. కొత్తపేట ఎస్ఐ డి.జ్వాలసాగర్ తెలిపిన వివరాల మేరకు అంబాజీపేట మండలం చిరుతపూడికి చెందిన ఉండ్రాజావరపు శేఖర్ రావులపాలెంలో జెసిబి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఎప్పటిలానే శుక్రవారం పని పూర్తిచేసుకుని ఇంటికి తన బైకుపై బయలుదేరాడు. కమ్మిరెడ్డిపాలెం మలుపు వద్దకు వచ్చేసరికి ప్రయివేటు ట్రావెల్స్ బస్సు వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో శేఖర్ తీవ్రంగా గాయపడ్డాడు. అతని వెంటనే 108లో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం తీసుకెళ్లారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

రిలయన్స్ క్విజ్‌లో వెలగతోడు విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - మండపేట

రిలయన్స్ క్విజ్ పోటీల్లో వెలగతోడు జిల్లా ఉన్నత పాఠశాల విద్యార్థులు పాంద్రంకి వెంకటేష్, ఇమ్మంది కౌశిక్‌కుమార్ తృతీయ స్థానం సాధించి రెండు సైకిళ్లను గెలుపొందారని గైడ్ ఉపాధ్యాయులు ఎన్.శ్రీనివాసరావు, మహ్మద్ సఫీర్ అహ్మద్ తెలిపారు. విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, తోటి విద్యార్థులు అభినందించారు.

డ్వాక్రా మహిళలకు ఆటో రిక్షా అందజేత

ప్రజాశక్తి - బిక్కవోలు

ఉన్నతి మహిళా శక్తి పథకం ద్వారా ఎస్‌సి, ఎస్‌టి డ్వాక్రా మహిళలకు ఎంఎల్ఎ డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి శుక్రవారం ఆటో రిక్షా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ వైఎస్ఆర్ కెపి ద్వారా మంజూరు కాబడిన ఆటో రిక్షాను బిక్కవోలు గ్రామానికి చెందిన శ్రీ మహాలక్ష్మి మహిళా శక్తి సంఘం సభ్యురాలు బొండపల్లి లక్ష్మీకి ఆటో రిక్షా ను పంపిణీ చేయడం జరిగిందన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని పలు కోర్టుల్లో శనివారం జాతీయ లోక్ అధాలత్‌ను నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గ్రంధం సునీత శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం, అమలాపురం, కాకినాడ, పెద్దాపురం, పిఠాపురం, రామచంద్రపురం, రాజోలు, ప్రత్తిపాడు, ఆలమూరు, తుని, ముమ్మిడివరం, కొత్తపేట, అనపర్తి, రంపచోడవరం, అడ్డతీగల కోర్టుల్లో లోక్ అధాలత్‌లు నిర్వహిస్తున్నామని, కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్ తగాదాలు, యాక్సిడెంట్ కేసులు, బ్యాంకు కేసులు, రాజీపడతగిన క్రిమినల్ కేసులు, ప్రీ-లిటిగేషన్ కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కరించనున్నట్లు తెలిపారు.

పశువులకు టీకాలు

ప్రజాశక్తి - చాగల్లు

తుపాను వల్ల పశువులకు వ్యాపించిన గొంతువాపు వ్యాధికి టీకాలు వేసే కార్యక్రమాన్ని స్థానిక పశువైద్యశాల వద్ద సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి, వైస్ ఎంపిపి జజ్జవరపు రామచంద్రరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కొవ్వూరు డివిజన్ పశు సంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ జి.రాధాకృష్ణ పాల్గొని పశుసంవర్ధక శాఖ ద్వారా అమలు చేస్తున్న పథ కాలను పాడి రైతులకు వివరిం చారు. ఈ శిబిరంలో పాడి రైతులకు ఖనిజ లవణ మిశ్రమాలను, లివర్ టానిక్‌లను పంపిణీ చేశారు. 15 ఆవులు, 58 గేదెలకు వివిధ వ్యాధులకు సంబంధించి చికిత్సలు, గర్భకోశ వ్యాధిలకు సంబంధించి టీకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ యు.ముఖేష్, డాక్టర్ ఎస్.సుజిత, వెటరినరీ అసిస్టెంట్ కె.రాజశేఖర్ వైద్య సేవలందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు ఎస్.అర్జునరావు, స్థానికులు సిహెచ్.దుర్గమల్లేశ్వరరావు, విజయలక్ష్మి, కరిష్మా పాల్గొన్నారు.



నీటిలో మునిగిపోయిన పంటను చూపుతున్న సత్యేంద్ర

రైతుల కష్టాలు ప్రభుత్వ వైఫల్యమే

ప్రజాశక్తి - తాళ్లపూడి

తుపాను నేపథ్యం లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలోనూ, రైతులను అప్రమత్తం చేయడంలో ప్రభు త్వ వైఫల్యం వల్లనే నేడు రైతులు కష్టాల పాలయ్యారని టిడిపి యువగళం నాయకులు కాకర్ల సత్యేంద్ర, టిడిపి మండల రైతు సంఘం అధ్యక్షులు అన్న మరెడ్డి సత్తిబాబు ధ్వజమెత్తారు. మండ లంలో పలు ప్రాంతాల్లో తుపాను ప్రభావంతో పంటలు నాశనం అయిన నేపథ్యంలో యువగళం ఆధ్వర్యంలో బృందాలుగా వివిధ ప్రాంతాల్లో వారు పర్యటించారు. పంట నష్టపోయిన రైతులను కలుసుకుని వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్ని తేమ శాతంతో సంబంధం లేకుండా ప్రభుత్వం తక్షణమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తేమను బట్టి తరుగు అడుగుతున్నారని, ఇది ఎవరి లోపమూ అర్థం కావడం లేదన్నారు. పంట నష్టానికి ఎకరాకు రూ.30 వేలు చొప్పున రైతులకు నష్ట పరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అధికారులకు అందజేశారు. కాకర్ల సత్యనారాయణ కూచిపూడి గణేష్, అనపర్తి ప్రసాద్, చెన్న సత్యనారాయణ పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం

ప్రజాశక్తి -మామిడికుదురు

ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించెందుకే ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం నిర్వహిస్తుందని పి.గన్నవరం, రాజోలు ఎంఎల్ఎలు కొండేటి చిట్టిబాబు, రాపాక వరప్రసాద్ తెలిపారు. మామిడికుదురు మండల పరిషత్ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎంపిపి కె.వనజకుమారి అధ్యక్షతన క్రీడాకారులకు క్రీడాపరికరాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. క్రీడల్లో రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సూరిసెట్టి బాబి, కె.ఆదిత్య, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న శ్రీ వకుళ మాత అన్నదాన భవన నిర్మాణానికి. శుక్రవారం రావులపాలేనికి చెందిన యక్కల వెంకటరాజారావు, లక్ష్మిచోడామణి దంపతులు రూ.1,01,116 విరాళం చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఆలయ ఇఒ ఎం.సత్యనారాయణ రాజులకు అందజేశారు. దాతలకు ఆలయ మర్యాదలతో స్వామివారి దర్శనం చేయించి తీర్థ ప్రసాదాలతో పాటు స్వామివారి చిత్రపటాన్ని అందించారు.



సాయం అందిస్తున్న సర్పంచ్ రాంబాబు

వైద్యానికి సర్పంచ్ రాంబాబు సాయం

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని చొప్పెల్ల విఆర్ఎ రొక్కాల దొరబాబు కుమారుని వైద్యానికి గుమ్మిలేరు సర్పంచ్ గుణ్ణం రాంబాబు రూ.5వేల సాయం అందించారు. దొరబాబు కుమారుని కడుపులో రంధ్రం ఏర్పడింది. ఆపరేషన్ చేయాలని డాక్టర్లు తెలిపారు. దీని కోసం రూ.4లక్షల వరకూ ఖర్చు అవుతుంది. విషయం తెలుసుకున్న రాంబాబు తన వంతు సాయంతో రూ.5వేలను అందించారు.



దుస్తులు మార్చుకునే గదులను ప్రారంభిస్తున్న సర్పంచ్ శ్రీదుర్గ

స్నాన ఘట్టం ప్రారంభం

ప్రజాశక్తి- ఉప్పలగుప్తం

గొల్లవిల్లి పంచాయతీ వాడపర్రు శ్మశాన వాటిక సమీపంలో దాతలు నిర్మించిన స్నాన ఘట్టాన్ని సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ ప్రారంభించారు. అంత్యక్రియలకు వచ్చిన వారు స్నానమాచరించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. చెరువులు, పంట కాలువలు కలుషితం కావడంతో స్నానాలు చేసేందుకు పడుతున్న ఇబ్బందులను చూసిన గ్రామానికి చెందిన మారిశెట్టి మరిడియ్య, రామాయమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుటుంబీకులు సుమారు రూ.3 లక్షలతో వెదజల్లు స్నాన ఘట్టంతో పాటూ దుస్తులు మార్చుకునేందుకు గదుల భవనాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీదుర్గ, గ్రామస్తులు దాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మారిశెట్టి పుండరీకాక్షుడు, వీరవల్లి చినబాబు, మురముళ్ల రామం, మారిశెట్టి సత్యనారాయణ, జొన్నాడ చిన్ని, మారిశెట్టి దుర్గారావు, దేవరపల్లి రాంబాబు, మారిశెట్టి నరేష్, అడపా దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



పూడికతీత తీయిస్తున్న సర్పంచ్ వెంకటేశ్వరరావు

సర్పంచ్ ఆధ్వర్యంలో పూడికతీత

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

అమలాపురం మండలం నడిపూడి-నల్లమిల్లి ప్రధాన పంట కాలువలో పూడిక తీత పనునలు నడిపూడి సర్పంచ్ చెల్లిబోయిన వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. తుపాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు పంట పొలాలు నీట మునిగి వరి చేలలో వర్షపు నీరు దిగడం లేదని రైతులందరూ సర్పంచ్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన సర్పంచ్ కాలువలో జెసిబితో పూడిక తీత పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ బొక్కా ఆదినారాయణ, ,రైతు సంఘం అధ్యక్షుడు అప్పారి చిన్నవెంకటరమణ, వ్యవసాయ శాఖ సిబ్బంది వెంకట్, సందీప్, రైతులు పాల్గొన్నారు.

పంట కాలువలో పూడికతీత

ప్రజాశక్తి - కొత్తపేట

ఇటీవల కురిసిన వర్షాలకు కొత్తపేట శివారు చిన్న గూళ్లపాలెంలో పంట చేలు మునిగిపోయి నీరు నిల్వ ఉండిపోయింది. పంట కాలవ పూడుకుపోవడంతో నీరు దిగక రైతులు అవస్థలు పడుతున్నారు. విషయం తెలుసుకున్న టిడిపి మండల అధ్యక్షులు కంఠంశెట్టి శ్రీనివాసరావు జెసిబి సాయంతో పూడికతీయించారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. పూడికతీత పనులు చేయకపోవడం వల్లే తాము పంటలను నష్టపోతున్నామని రైతులు తెలిపారు.

29 మంది ఉద్యోగాలకు ఎంపిక

ప్రజాశక్తి -మామిడికుదురు

మామిడికుదురు దీప్తి డిగ్రీ కళాశాల, 'వికాస' ఆధ్వర్యంలో శుక్రవారం కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 29 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ డివివి.సత్యనారాయణ తెలిపారు. వికాస సంస్థ ప్రతినిధులు జి.రమేష్, రాజారమేష్, రవితేజ ఈ ఇంటర్వ్యూలు నిర్వహించారు. 54 మంది హాజరయ్యారు. అందులో 29 మంది మౌఖిక పరీక్షల్లో విజయం సాధించి ఉద్యోగాలకు ఎంపికయ్యారని వారు తెలిపారు. డెక్కన్ కెమికల్స్ కంపెనీలో ట్రైనీ(ప్రొడక్షన్), కోజెంట్ ఇ సర్వీసెస్, బిపిఒ, డిక్సాన్, సియోన్ ఇ-హెచ్‌డబ్ల్యూఎ సుమిత్, ఇసుజు మోటార్స్ కంపెనీల్లో టెక్నిషియన్ ఉద్యోగాలకు వీరిని ఎంపిక చేశామన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.12వేల నుంచి రూ.20వేల వరకూ వేతనం, ఇన్సెంటివ్‌లు, భోజన, వసతి, రవాణా సౌకర్యాలు ఉంటాయన్నారు. ఇంటర్న్‌షిప్ శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరిచి వికాస అందజేసే సహకారాన్ని అందుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా విభాగాల అధిపతులు మోకా రంగారావు, వాసంశెట్టి నాగరాజు, రవికుమార్, బి. సజన, కోడూరి వెంకటేష్, యర్రంశెట్టి విజయ్ సత్య ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పాలతోడులో జరుగుతున్న డ్రెయినేజీ పనులు

దళిత కాలనీలో డ్రెయినేజీల నిర్మాణం

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - మండపేట

మండలంలోని పాలతోడు దళిత కాలనీలలో డ్రెయినేజీ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. డ్రెయినేజీలు లేక కాలనీ ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రజాశక్తి దినపత్రిక వార్తను ప్రచురించింది. ఈ వార్తకు స్పందించిన పాలకులు, అధికారులు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రూ.20 లక్షల నిధులను కేటాయించి డ్రెయినేజీ నిర్మాణ పనులను చేపట్టారు. ఈ నెలాఖరు నాటికి పనులు పూర్తి చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ జెఇ భాగ్యరాజు తెలిపారు.

ఎంఎల్ఎ దంపతులకు ఘన సత్కారం

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

భీమేశ్వరాలయంలో లక్షపత్రి పూజలు చేయించుకున్న పెదకూరపాడు ఎంఎల్ఎ నంబూరు శంకరరావు దంపతులను శుక్రవారం రాష్ట్ర హౌసింగు కార్పోరేషన్ చైర్మన్, దవులూరి దొరబాబు, ఆయన తండ్రి దవూలూరి సుబ్బారావు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, వైసిపి కౌన్సిలర్ నేతల హరిబాబు, మాజీ కౌన్సిలర్ దూది రాజుబాబు తదితరులున్నారు.



ఎంఎల్ఎ శంకర్రావు దంపతులను సత్కరిస్తున్న దొరబాబు

స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం

ప్రజాశక్తి - కడియం

గ్రామ స్వపరిపాలనకు కావలసిన నిధులు ఇవ్వకుండా స్థానిక సంస్థలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి ధ్వజమెత్తారు. శుక్రవారం కడియంలో ఎంపిపి వెలుగుబట్టి ప్రసాద్ ఆధ్వర్యంలో మాజీ జడ్‌పిటిసిలు, మాజీ ఎంపిపిలు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపిటిసి సభ్యులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో గోరంట్ల మాట్లాడుతూ గ్రామ సచివాలయాల నిర్వహణ పట్ల ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంభిస్తోందన్నారు. గ్రామ పంచాయతీలకు సచివాలయాలతో ఏమాత్రం సంబంధం లేదని, ప్రజలతో ఎన్నుకోబడిన సర్పంచ్‌లను సిఎం జగన్ రెడ్డి ఉత్సవ విగ్రహాలుగా చేశారని విమర్శించారు. పంచాయి తీలకు వచ్చే కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే వేలాది కోట్ల రూపాయలను పక్కదారి పెట్టించారని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న మోసం వల్ల పంచాయితీ వ్యవస్థ నిర్వీర్యం అయ్యే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. సర్పంచ్, వార్డుసభ్యులకు తెలియకుండా, పంచాయతీ బోర్డు తీర్మానం లేకుండా పంచాయతీ ఖాతాల నుంచి నిధులు మళ్లించడం ద్వారా స్థానికసంస్థల ప్రతినిధులను ప్రభుత్వం మోసం చేయడమేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం వాటా చెల్లించకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు దోహదం చేసే జల జీవన్ మిషన్ పథకం నిలిచిపోయిందని తెలిపారు. ఈ ఐదేళ్ల జగన్ రెడ్డి పాలనలో గ్రామాల్లో రోడ్డు కాని, కాలువలు కానీ నూతనంగా వేసిన పరిస్థితి లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో డ్రైనేజీ, తాగునీటి వ్యవస్థ అధ్వానంగా మారిపో యిందని అన్నారు. ఆఖరికి పంచాయతీలో బ్లీచింగ్ వేయ డానికి కూడా డబ్బులు లేని స్థితిలో పంచాయతీ వ్యవస్థను దిగజార్చిసేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరిగి టిడిపి ప్రభుత్వం ఏర్పాటుతోనే పంచాయితీలకు పూర్వవైభవం వస్తుందని అన్నారు. పంచాయితీలకు నిధులతోపాటు, విధులను సక్రమంగా నిర్వర్తించే అవకాశం టిడిపి పాలన లోనే సాధ్యమని, ఇప్పటినుంచే గ్రామాల అభివృద్ధిపై టిడిపి ప్రణాళికను సిద్ధం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు వెలుగుబంటి రఘురామ్, రూరల్ మండలం టిడిపి అధ్యక్షులు మచ్చేటి ప్రసాద్, నాయకులు ఎం.సత్యనారాయణ, పి.రామారావు చౌదరి, ఎం.సత్యవతి, జి.సత్యనారాయణ, వి.నాగబాబు, కృపారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ గోరంట్ల

పంట నష్టపోయాం ఆదుకోండి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

తుపాను ప్రభావంతో పంటను నష్టపోయామని, ప్రభుత్వం తక్షణమే తమను ఆదుకోవాలని ఉండ్రాజవరం, తాడిపర్రు గ్రామాల రైతులు గోపా గోపాలం, చిన్న రాజా, వెంకట్రావు, శ్రీనివాసు, కరుటూరి వెంకట సూర్యనారాయణ, కరుటూరి వెంకట చౌదరి, బందుల విశ్వేశ్వరరావు, అక్కాబత్తుల సత్యనారాయణ, అరిగెల సుబ్రమణ్యం కోరారు. పంట నష్టంను అంచనా వేసేందుకు వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు శుక్రవారం ఆయా గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా రైతులు తమకు జరిగిన నష్టంపై అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా ఉద్యానవన, వ్యవసాయ శాఖ అధికారులు సిహెచ్.శ్రీనివాస్, ఎం.విశ్వాసరావు మాట్లాడుతూ తుపాను కారణంగా నాలుగు రోజులపాటు కురిసిన వర్షాలతో సుమారు 300 ఎకరాల్లో వరి, 20 హెక్టార్లలతో అరటి, కూరగాయల పంట దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు తెలిపారు. ప్రస్తుతం వరిచేల నుంచి వర్షపునీరు బయటకు వెళ్లిపోయినప్పటికీ, చేనులోకి కోత యంత్రం వెళ్లే అవకాశం లేదని, పంట కోతకు ఇంకా కనీసం 10 నుంచి 15 రోజులు సమయం పడుతుందని తెలిపారు. మండలంలోని కె.సావరం, మోర్త గ్రామాల్లో అధిక శాతం అరటి తోటలు, దమ్మెన్ను, వేలివెన్ను గ్రామాల్లో కూరగాయల పంట నష్టం కలిగినట్లు చెప్పారు. ఈ పర్యటనలో ఎంపిఇఒ ఇంజేటి నాగమణి, సిద్ధాని జగదీశ్వరి ఉండ్రాజవరంలో వరి పంట నష్టాన్ని పరిశీలించారు.



పంట నష్టాన్ని పరిశీలిస్తున్న సచివాలయ సిబ్బంది



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న విసి పద్మరాజు

నేటి నుంచి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

ప్రజాశక్తి - రాజానగరం

ఆదికవి నన్నయ యూనివర్సిటీలో నేటి నుంచి సౌత్ అండ్ వెస్ట్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ మెన్ అండ్ ఉమెన్ ఛాంపియన్ షిప్ 2023 -24 నిర్వహిస్తున్నామని విసి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. శుక్రవారం యూనివర్సిటీలో వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్‌కు సంబంధించిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ప్రత్యేక శ్రద్ధతో అన్ని కమిటీల కోఆర్డినేటర్లు, టెక్నికల్ అఫీషియల్స్, టీమ్ మేనేజర్స్ అండ్ కోచ్‌లకు తగిన సూచనలను చేశారు. సమష్టిగా కృషి చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పాండిచ్చేరి, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, గుజరాత్, గోవా రాష్ట్రాల్లోని సుమారు 90 యూనివర్శిటీల నుంచి క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు.. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఔనత్యాన్ని పెంచే విధంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

క్రీడా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని ఆడుదాం ఆంధ్ర పేరుతో క్రికెట్, టెన్నిస్, వాలీబాల్, ఖోఖో, ఇతర గేమ్స్‌కు సంబంధించిన కిట్లను శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ కె.జాన్‌లింకన్ ఆధ్వర్యంలో ఎంపిపి తోరాటి లక్ష్మణరావు, వైసిపి మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్, ఎఎంసి చైర్మన్ యనమదల నాగేశ్వరరావు చేతుల మీదుగా పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15 ఏళ్లకు పైబడిన వారందరూ ఈ క్రీడల్లో పాల్గొనొచ్చన్నారు. ఈ నెల 15 నుంచి ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎఒ రామ స్వరూప్, ఇఒపిఆర్‌డి రాజ్‌కుమార్, ఎపిఎం ధనరాజు, ఎపిఒ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.




నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న బాబూరావు

బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి - తాళ్లపూడి

పునరావస కేంద్రాల్లో ఉన్న తుపాను బాధితులకు నిత్యవసర సరుకులను పంపిణీ చే శారు. తుపాన్ కారణం గా ప్రక్కిలంక, పైడిమెట్ట గ్రామాల్లో ఏర్పాటుచేసిన పునరావాస శిబిరాల్లో తలదాచుకుంటున్న 28 కుటుంబాలకు ఎంపిపి జొన్నకూటి పోసిరాజు, సర్పంచ్ స్వప్న ఆదేశాలతో ఒక్కొక్క కుటుంబానికి 25 కేజీల బియ్యం, ఇతర నిత్యవసర సరుకులు, కూరగాయలను కొవ్వూరు నియోజకవర్గ వైసిపి ఎస్‌సి విభాగం అధ్యక్షులు యాళ్ల బాబురావు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకుడు కొల్లి.దుర్గారావు, విఆర్ఒ విజయ కుమారి, వాలంటీర్లు రాధిక, నక్షత, సౌందర్య తదితరులు పాల్గొన్నారు.



పూడికతీత పనులను చేయిస్తున్న ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు

పోతవరంలో పంటలను పరిశీలించిన ఎంఎల్ఎ

ప్రజాశక్తి - పి.గన్నవరం

పోతవరంలో భారీ వర్షాలతో మునిగిపోయి నానుతున్న పంట పొలాలను శుక్రవారం సర్పంచ్ వడలి కొండయ్య ఆధ్వర్యంలో పి.గన్నవరం ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు పరిశీలించారు. వెంటనే ఎంఎల్ఎ స్పందించి మురుగునీరు మళ్లించేందుకు జెసిబితో పూడిక తీయించారు. మురుగు నీరు మళ్లింపు చర్యలు చేపట్టారు. మురుగునీరు తొలగించడంతో రైతులు కొంత ఉపశమనం చెందారు.

వైసిపి హయాంలో గ్రామాల అభివృద్ధి శూన్యం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

వైసిపి ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధి శూన్యమని జనసేన పార్టీ అమలాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి శెట్టిబత్తుల రాజబాబు విమర్శించారు. చినగాడవిల్లిలో గురువారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో రాజబాబు మహా సంకల్పయాత్రను నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి జనసేన పార్టీ సిద్ధాంతాలను వివరించారు. కరపత్రాలను అందించారు. జనసేన పార్టీకి ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. నాయకులు అరిగెల సూరిబాబు, చెరుకూరి శ్రీనివాస్, చిక్కం సూర్యమోహన్, నూకల రాజా, చవటపల్లి వినయ్, గుత్తుల మాధవ, నిమ్మకాయలు రాము, దోనిపాటి అశోకచక్రవర్తి, జనిపెల్ల శివాజీ, గుర్రాల నాగు, ప్రసాద్, మచ్చా శ్రీనివాస్, మాకే దుర్గారావు, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ జెఇగా పోసమ్మ బాధ్యతల స్వీకరణ

ఆలమూరు : మండల ఆర్‌డబ్ల్యూఎస్ జెఇగా ఎం.పోసమ్మ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె గతంలో రాజమహేంద్రవరం డిఆర్ఒ కార్యాలయానికి డిప్యూటేషన్‌పై వెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఇంజినీరింగ్ శాఖలో డిప్యుటేషన్లు రద్దు చేయడంతో మళ్లీ ఆమె ఆలమూరు జెఇగా నియమితులయ్యారు. ఇప్పటి వరకూ ఇన్‌ఛార్జి జెఇగా వ్యవహరించిన పి.పద్మ యథాస్థానానికి బదిలీ అయ్యారు. జల్‌జీవన్ మిషన్ పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటానని పోసమ్మ తెలిపారు.

నేడు ఎస్‌సి, ఎస్‌టి మైనార్టీల వన సమ్మేళనం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రతి ఏడాది మాదిరిగానే ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ ఐక్య వేదిక ఆధ్వర్యంలో శనివారం నిర్వహిస్తున్న మన చైతన్య వన సమ్మేళనం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వేదిక చైర్మన్ గుబ్బల రాంబాబు, కన్వీనర్ అజ్జరపు వాసు పిలుపునిచ్చారు. జాతీయ రహదారిలోని బెస్ట్ ప్రైస్ పక్కన గల చెరుకూరి గార్డెన్స్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి మన చైతన్య వన సమ్మేళనం కార్యక్రమం ప్రారంభం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి కమిషన్ చైర్మన్ ఎం విక్టర్ ప్రసాద్, తెలంగాణ స్టేట్ పోలీస్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ జి జానకి షర్మిల, తూర్పు గోదావరి జిల్లా అడిషనల్ ఎస్‌పి పి సోమశేఖర్, జిఎస్‌టి అసిస్టెంట్ కమిషనర్ శ్రీకృష్ణ, ఎల్ఐసి సీనియర్ డివిజనల్ మేనేజర్ బి.ప్రసాద్ రావు, ఎపి ఇపిడిసిఎల్ జనరల్ మేనేజర్(విశాఖ) తిలక్ కుమార్, ఎపి ఇపిడిసిఎల్ తూర్పు గోదావరి జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నక్కపల్లి సామ్యూల్, డిప్యూటీ చీఫ్ కంట్రోల్ ఆఫ్ అకౌంట్స్ వి.డి.సర్వేశ్వరరావు, ఎపి స్టేట్ హజ్ కమిటీ చైర్మన్ బిఎస్.గౌస్ లజామ్, ప్రజా గాయకుడు, దక్షిణ భారతదేశ సమత సైనిక్ ఉపాధ్యక్షులు షాన్ రేంజర్ల రాజేష్ పాల్గొంటున్నారని తెలిపారు. అంబేద్కర్ ఆలోచన విధానంతో దళిత గిరిజన మైనార్టీలను ఐక్యం చేసే లక్ష్యంతో గత ఏడేళ్లుగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో రాజకీయాలకు అతీతంగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కొంతమూరు షానా, యాదల సతీష్ చంద్ర స్టాలిన్, బోర్రా చిన్ని, కప్పల వెలుగు కుమారి పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.